2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు

క్లుప్తంగా

2022కు ఇక సెలవు.. సూర్యాస్తమయం



వెంకటాపురం (ఎం) : 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ మండలంలోని రామప్ప సరస్సుపై సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యం వీక్షకులను ఆకట్టుకుంది. పాత సంవత్సరానికి వీడ్కోలు.. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నట్టుగా కనిపించిన ఈ రమణీయ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు పాటించాలి

ఏటూరునాగారం : న్యూ ఇయర్ వేడుకలను ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలని ఏఎస్పీ అశోక్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. డీజేలు, అర్ధరాత్రి వరకు నృత్యాలు అనుమతించబోమని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ధాన్యం లారీ బోల్తా



మంగపేట : ధాన్యం లోడుతో ప్రయాణిస్తున్న లారీ మండలంలోని రమణక్కపేట వద్ద బోల్తా పడింది. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. మండలంలోని మల్లూరు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడ్ చేసుకుని రాజుపేటలోని సాయిసుధ ఆగ్రో రైస్‌మిల్‌కు బయల్దేరిన లారీ దారిలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బోల్తాపడింది. ఈ ఘటనలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పరామర్శ

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని వెంగళాపూర్ గ్రామానికి చెందిన అల్లెం లక్ష్మయ్య ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబాన్ని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి శనివారం పరామర్శించారు. తొలుత లక్ష్మయ్య మృతి పట్ల సంతాపం తెలిపారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. అల్లెం లక్ష్మయ్య మృతి బాధాకరమని తెలిపారు. మృతుడి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, సర్పంచ్‌లు గద్దం అరుణ, చిడం బాబురావు, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు నాగమ్మ, నాయకుడు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పపై వ్యాఖ్యలు దుర్మార్గం

- జిల్లావ్యాప్తంగా నిరసనల వెల్లువ

అయ్యప్ప దేవుడిపై వ్యాఖ్యలు చేసిన బైరి నరేశ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని పలు మండలాల్లో అయ్యప్ప దీక్షాధారులు, ప్రజలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.



మంగపేట : తిమ్మంపేట క్రాస్ వద్ద నరేశ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అయ్యప్ప దీక్షాధారులు



ఏటూరునాగారం : నిరసన తెలుపుతున్న భక్తులు



వెంకటాపురం (ఎం)లో..



కన్నాయిగూడెంలో..

ఏటూరునాగారం : అయ్యప్ప దేవుడిపై వ్యాఖ్యలు నిరసిస్తూ అయ్యప్ప దీక్షాధారులు మండల కేంద్రంలోని బొడ్రాయి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అర్చకులు సుదర్శన్, రాధాకృష్ణ శర్మ, సూర్యనారాయణ శర్మ, గురుస్వాములు పాపన్న, అల్లి శ్రీనివాస్, పెండ్యాల ప్రభాకర్ మాట్లాడారు. నరేశ్‌పై కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్సై రమేశ్‌కు ఫిర్యాదు పత్రం అందజేశారు. కార్యక్రమంలో బోడ సత్యం, పాపని రాజు, శివ, దొడ్డ కృష్ణ, నరేశ్, లాలయ్య, కల్యాణ్, బోడ శంకర్, గణేశ్, రాజేశ్, అలువాల శ్రీనివాస్, సారయ్య, శ్రీకాంత్, అన్వేశ్ పాల్గొన్నారు.

మంగపేట : మండలంలోని కమలాపురం అంబేద్కర్ సెంటర్‌లో అయ్యప్ప సేవా సమితి గురుస్వామి తలారి సుబ్బయ్యనాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం సుబ్బయ్యనాయుడు మాట్లాడారు. నరేశ్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రైతుబంధు కమిటీ జిల్లా సభ్యుడు పచ్చా శేషగిరిరావు, మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, వేమ పద్మారావు, బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాసరావు, అయ్యప్ప దీక్షాధారులు కృష్ణారావు, రామ్మూర్తి, జక్రయ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

మండలంలోని తిమ్మంపేట క్రాస్ వద్ద ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై నరేశ్ దిష్టిబొమ్మను అయ్యప్ప దీక్షాధారులు దహనం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప దీక్షాధారులు చిలకమర్రి శ్రీనివాస్, గద్దం కోటేశ్వర్‌రావు, కుమార్, వెంకటేశ్వర్లు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం (కె) : అయ్యప్ప దేవుడిపై నాస్తిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేశ్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో అయ్యప్ప దీక్షాధారులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్‌పై పీడీ యాక్ట్ అమలు చేయాలని అయ్యప్ప దీక్షాధారులు డిమాండ్ చేశారు. తొలుత అయ్యప్ప ఆలయం నుంచి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చిడెం శివ, అశోక్, మహేశ్, చిడెం రమేశ్, మాదాల సంతోశ్ పాల్గొన్నారు.

కన్నాయిగూడెం : మండలంలోని గుర్రేవులలో ప్రధాన రహదారిపై అయ్యప్ప దీక్షాధారులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో గురుస్వామి శంకర్, శివ, అయ్యప్ప దీక్షాధారులు సత్యనారాయణ, విజయ్, శ్రీధర్, సతీశ్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

ఏటూరునాగారం : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు టీవీ.వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. ఉపాధ్యాయుల మెడికల్, సరెండర్, జీపీఎఫ్ బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కేజీబీవీల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతోపాటు కేజీబీవీల్లోని సమస్యలు పరిష్కరించాలని, టీఎల్ఎం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వాంకుడోత్ రాంబాబు, అడప రాజేందర్, ఉట్నూరు రాంబాబు, సారికి బంగారు, నాయకపు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాజకీయ భూస్థాపితం ఖాయం



మాట్లాడుతున్న పుల్లూరి కరుణాకర్

ఎస్ఎస్ తాడ్వాయి : శీతాకాల పార్లమెంటరీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకుంటే బీజేపీని రాజకీయంగా భూస్థాపితం చేయడం ఖాయమని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పుల్లూరి కరుణాకర్ హెచ్చరించారు. మండలంలోని కాటాపూర్ గ్రామంలో మబ్బు నవీన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి కరుణాకర్ హాజరై మాట్లాడారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ఎనిమిదేళ్లు గడచినా మోసపూరితంగానే వ్యవహరిస్తోందని విమర్శించారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లంజపెల్లి రవికుమార్, అధికార ప్రతినిధిగా శ్రావణ్, ఉపాధ్యక్షుడిగా పుల్లూరి నిస్సిపాల్, ప్రధాన కార్యదర్శిగా భరత్, ప్రచార కార్యదర్శిగా పల్లూరి నవీన్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సమావేశంలో నాయకులు నాగేశ్, దామెర స్వామి, రఘు, చిరంజీవ, చంటి, కృష్ణ, శ్రావణ్ పాల్గొన్నారు.

మొబైల్ హెల్త్ టీం వైద్యాధికారిగా సాయినాథ్



నియామక పత్రాన్ని అందజేస్తున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం : ఐటీడీఏ వైద్య ఆరోగ్య శాఖ విభాగం ద్వారా జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్టు ప్రాతిపదికన ఏర్పాటు చేసిన మాత శిశు ఆరోగ్య ఎపిడమిక్ బృందం కొత్తగూడ మండల మొబైల్ హెల్త్ టీం వైద్యాధికారిగా డాక్టర్ సాయినాథ్‌ను నియమిస్తూ ఐటీడీఏ పీఓ అంకిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డాక్టర్ సాయినాథ్‌కు పీఓ ఉత్తర్వులు అందజేశారు. కొత్తగూడ మండలంలోని గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు, ఇతర వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని పీఓ సూచించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం మేనేజర్ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



వాహనదారులకు గులాబీ పువ్వు ఇస్తున్న విద్యార్థులతో ఎస్సై తాజొద్దీన్

వెంకటాపురం (ఎం) : వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని కోరుతూ మండల కేంద్రంలోని జోహార్ పాఠశాల విద్యార్థులు ప్రధాన రహదారిపై శనివారం వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. గులాబీ పువ్వు అందిస్తూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వాహనదారులను విద్యార్థులు కోరారు. ఈ కార్యక్రమానికి ఎస్సై తాజొద్దీన్ మాట్లాడారు. డిసెంబర్ 31 నేపథ్యంలో మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ జావీద్‌తో కలిసి ఎస్సై తిలకించారు.

వేదవ్యాస పాఠశాలలో ఫుడ్ ఫెస్ట్

మండల కేంద్రంలోని వేదవ్యాస హైస్కూల్‌లో ఫుడ్ ఫెస్ట్ నిర్వహించగా ఎస్సై తాజొద్దీన్ తిలకించారు. విద్యావిధానంలో భాగంగా విద్యార్థులకు వ్యాపార మెళకువలు నేర్పించేలా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు తెలిపారు. విద్యార్థులు తయారు చేసుకొని తీసుకొచ్చిన ఆహార పదార్థాలను షాపింగ్ మాల్స్ మాదిరిగా పెట్టి విక్రయించగా ఎస్సై తాజొద్దీన్, సర్పంచ్ మేడబోయిన అశోక్ కొనుగోలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భాషబోయిన జగదీశ్వర్, డైరెక్టర్లు చింతిరెడ్డి సూర్యప్రకాశ్‌రెడ్డి, పసునూటి రాజయ్య, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఎంఎస్ కార్యవర్గం ఎన్నిక



పదవీ విరమణ పొందిన కార్మికులను సన్మానిస్తున్న బీఎంఎస్ సభ్యులు

మంగపేట : మండలంలోని కమలాపురంలోని కార్యాలయంలో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కమిటీని ఎన్నుకున్నారు. తొలుత సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు పాకనాటి వెంకట్‌రెడ్డి, వీవీఎస్.శర్మ అధ్యక్షతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భువనగిరి యాదగిరి, కార్యదర్శిగా రామిడి సురేశ్ ఎన్నికయ్యారు. అనంతరం పదవీ విరమణ పొందిన బిల్ట్ కార్మికులను బీఎంఎస్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సుదర్శన్, చిందం శ్రీనివాస్, నందమూరి రాజయ్య, గుర్రవ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, భాస్కర్, వెంకటమల్లు, రమణమూర్తి, సుధాకర్, తేజమ్మ, నర్సయ్య, సిద్దిరెడ్డి, బుచ్చిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

4న జిల్లా స్థాయి పోటీలు

భూపాలపల్లి అర్బన్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 4న జానపద గేయాలు, జానపద నృత్యాలు, ఉపన్యాస అంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారిణి సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 ఏళ్లలోపు వయస్కులైన ఆసక్తి కలిగిన యువత ఈనెల 3లోపు జిల్లా యువజన శాఖ కార్యాలయంలో లేదా 83285 77652లో సంప్రదించాలని పేర్కొన్నారు.

'మున్నూరు కాపు' క్యాలెండర్ ఆవిష్కరణ



వెంకటాపురం (ఎం) : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ నాగరాజు



ములుగు రూరల్ : (గోవిందరావుపేట)లో..

వెంకటాపురం (కె) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాయలంలో మున్నూరు కాపు సంఘం –2023 క్యాలెండర్‌ను తహసీల్దార్ అంటి నాగరాజు శనివారం ఆవిష్కరించారు. అనంతరం సీఐగా పదోన్నతి పొందిన ఎస్సై తిరుపతిని ఆ సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమాల్లో సంఘం భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు జాపతి శ్యామ్, మండల కార్యదర్శి దాసరి నారాయణరావు, గౌరవ సలహాదార్లు బెజ్జని సత్తిబాబు, కూసం సాంబశివరావు, నాయకులు రంగయ్య నాయుడు, సుంకరి నానాజీ, ఎడ్ల క్రాంతి, పిల్లాల లీలారాణి, నాగరాజు, వెంకట్రావు, గోవింద్ పాల్గొన్నారు.

ములుగు రూరల్ (గోవిందరావుపేట) : సమాజ హితం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని పస్రా ఎస్సై కరుణాకర్‌రావు ఆకాంక్షించారు. మండలంలోని చల్వాయి గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం నిర్వహించిన గోసంగి సంఘం సమావేశానికి ఎస్సై కరుణాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ఆ సంఘం డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. నూతన సంవత్సరంలో గోసంగి ప్రజలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అలాగే అన్ని తరగతుల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అన్నారు. యువత సత్ప్రవర్తన కలిగి చెడుకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రమేశ్, సర్పంచ్ ఈసం సమ్మయ్య, తేళ్ల హరిప్రసాద్, కనకయ్య, పుష్పలీల, రాజకొమురయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన మహిళ ఆచూకీ లభ్యం



లక్ష్మిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై

టేకుమట్ల(రేగొండ): తప్పిపోయిన మహిళ ఆచూకీ తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన మండలంలోని కాకర్లపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం రేగొండ మండలంలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన ఒరంగంటి లక్ష్మి కూలీ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై జిల్లాలోని సిబ్బందిని అలెర్ట్ చేయగా భూపాలపల్లి మండలంలోని గుడాడ్‌పల్లిలో మహిళను గుర్తించారు. సాయంత్రం ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. లక్ష్మిని ఇంటికి చేర్చినందుకు ఆమె కుటుంబీకులు ఎస్సైకి కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

చిట్యాల: మండలంలోని కాల్వపల్లి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జడల్‌పేట గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఏలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నేరేడుపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ మేకల స్టాలిన్, ఓనర్ బండి సునీల్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది సిద్దార్థ (సిద్దు), లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

మహాముత్తారం: మండలంలోని వజినేపల్లికి చెందిన ఇద్దరిపై కేసు నమోదైనట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వజినేపల్లి గ్రామానికి చెందిన మారుపాక సమ్మక్కను గ్రామానికి చెందిన ఇరుకు సమ్మక్క, రజిత గొడవపడి గాయపర్చారు. సమ్మక్క శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనాల తనిఖీ

మహదేవపూర్: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఎస్సై రాజకుమార్ ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు చేశారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి డ్రంకెన్ డ్రవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్సై హెచ్చరించారు.

బస్సు కిందపడి వ్యక్తి మృతి

మణుగూరు రూరల్ : ప్రమాదవశాత్తు బస్సు కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన భద్రాద్రి జిల్లా మణుగూరులో సురక్షా(ఆర్టీసీ) బస్టాండ్ ప్రాంగణంలో శనివారం చోటుచేసుకుంది. భూపాలపల్లికి చెందిన జీడుల రాజ్‌కుమార్ మణుగూరు వచ్చి ఇంటికి తిరిగి వెళ్లేందుకు సురక్షా బస్టాండ్ చేరుకుని బస్సులో సీటు కోసం కిటికీలో నుంచి రుమాల్‌ను సీటులో వేసే క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. బస్సు ఒక్కసారిగా ముందుకు కదలడంతో టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మణుగూరు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.